క్లుప్తంగా

6 ఆర్బీకేలకు చేరిన వరి విత్తనాలు



గిడుతూరు ఆర్బీకేలో వరి విత్తనాలు

మాకవరపాలెం: మండలంలోని ఆరు రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు చేరాయని ఏవో చిరంజీవి మంగళవారం తెలిపారు. మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు 80 టన్నులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటివరకు ఆరు కేంద్రాలకు 30 టన్నుల విత్తనాలు చేరాయన్నారు. మిగిలిన వాటికి రాగానే రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

26 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపుపై సర్వే

మాకవరపాలెం: ఈ నెల 26 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపుపై ఇంటింటి సర్వే చేపట్టనున్నట్టు వైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఈ నెల 26 నుంచి 14 రోజులపాటు ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధి గుర్తింపుపై సర్వే చేయాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం చేయొద్దని, అనుమానిత కేసుల వివరాలను తమకు తెలియజేయాలన్నారు. సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవోలు జాన్సన్, గంగరాజు పాల్గొన్నారు.

మంచినీటి పథకానికి శంకుస్థాపన

చీడికాడ: జేబీపురంలో మంచినీటి పథకానికి తహసీల్దార్ బి.వి.రాణి మంగళవారం శంకుస్థాపన చేశారు. దీనికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.80 లక్షలు మంజూరు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, వైస్ ఎంపీపీ స్వాతి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

రావికమతం: మేడివాడలో మంగళవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక యువకుడు పతివాడ ధనంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. 102 మంది రోగులకు పరీక్షలు చేశారు. వీరిలో 36 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఏరియా కోర్డినేటర్ అరుణ్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాసులు ఖర్చయ్యే కాన్వెంట్ విద్య వద్దు..



విదార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం రాము

రోలుగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలపై అర్ల పంచాయతీలో మంగళవారం హెచ్‌ఎం బోనెల రాము విస్తృత ప్రచారం చేశారు. దీనిలో భాగంగా పాఠశాల సమయం ముగిసిన తర్వాత ఆయన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి అర్ల గ్రామ వీధిలో ప్రదర్శనగా తిరిగారు. కాసులు ఖర్చయ్యే కాన్వెంట్ విద్య వద్దు... ఉచితంగా నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలే ముద్దు.. అంటూ నినాదాలు చేశారు. తరువాత చిన్నారులతో ఉత్సాహంగా పాటలు పాడించి ఆనందపరిచారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అటువంటి ఇన్సూరెన్స్ సంస్థలను నమ్మొద్దు

నర్సీపట్నం: వ్యవసాయ శాఖ సిబ్బంది తప్ప ఎవరైనా ఇన్సూరెన్స్ చేస్తామని వస్తే రైతులు నమ్మవద్దని ఏవో అప్పారావు పేర్కొన్నారు. కొన్ని సంస్థలు, ఆర్గనైజేషన్స్ ఇన్సూరెన్స్ పేరుతో రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి తీసుకువచ్చిందన్నారు. రైతులు వాస్తవాలు గ్రహించాలని, అటువంటి సంస్థల ఉచ్చులో పడవద్దని సూచించారు. మాయమాటల్లో పడి మోసపోవద్దన్నారు.

జనం చెంతకే సంక్షేమం



చింతలూరు తారురోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు చదివి వినిపిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా జనం చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వీరనారాయణంలో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రెండో రోజు మొత్తం 1,054 గృహాలు సందర్శించారు. గ్రామానికి చెందిన మహిళలు తమకు తాగునీటికి ఇబ్బంది ఉందని అడగడంతో మంచి నీటి ట్యాంకుతోపాటు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడానికి రూ. 97 లక్షలు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ గ్రామంలోనే 17 రకాల సంక్షేమ పథకాల ద్వారా 4,134 మంది లబ్ధిదారులకు 10 కోట్ల 16 లక్షల 85 వేల 64 రూపాయల లబ్ధి చేకూరిందన్నారు.

రూ.48 లక్షలతో తారురోడ్డు ప్రారంభం

పీఎంజీఎస్‌వై నుంచి రూ.48 లక్షలతో వీరనారాయణం నుంచి చింతలూరు గదబూరు వరకు నిర్మించిన తారు రోడ్డును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తున్నానన్నారు. ఇప్పటికే దాదాపుగా గిరిజన గ్రామాలకు పక్కా రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు విస్సారపు రామారావు, మాజీ సర్పంచ్ తూరుబిల్లి సత్తింబాబు, పీఏసీఎస్ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ, సర్పంచ్ ఎల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, చింతలూరు సర్పంచ్ కాళింగ శకుంతల కళ్యాణరాజ్, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, పార్టీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు దాసరి రాజు, పత్రే ముత్యాలనాయుడు, ములకలపల్లి శ్రీనివాసరావు, దాడి మహేష్, పత్రే సూరిబాబు, శిరిశోళ్ల మల్లేశ్వరరావు, గళ్లా శ్రీనివాసరావు, గుమ్మాల వరహాలు నాయుడు, కోట్ని శ్రీరాంమూర్తి, బొద్దపు భాస్కరరావు పడాల అప్పారావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



గంపవానిపాలెంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గంపవానిపాలెం, అంట్లంపాలెం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూములు రెవెన్యూ రికార్డులో ఎడ్‌మార్క్‌లో ఉన్నాయని గ్రామానికి చెందిన గద్దె శ్రీను, ఈశ్వరరావు ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ మహేశ్వరరావును ఆదేశించారు. గంపవానిపాలెం స్కూల్‌లో ముగ్గురు ఉపాధ్యాయుల కొరత ఉందని, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయమై ఫోన్లో డీఈవోతో మాట్లాడారు. డిప్యుటేషన్‌పై తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాన్ని డంపింగ్ యార్డుగా ఉపయోగించడం వల్ల సమీప ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పరిష్కరించాలని కోరారు. గంపవానిపాలెం రామాల యం సమీపంలో రూ.20 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి ఆయన హామీ ఇచ్చారు. అంట్లంపాలెంలో రూ.24 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మిస్తామని, సీసీరోడ్డుకు జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.లక్ష, కల్వర్టు నిర్మాణానికి రూ.4 లక్షలు, తాగునీటి బోరు ఏర్పాటుకు రూ.లక్ష మంజూరు చేస్తున్నట్టు ధర్మశ్రీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, సర్పంచ్ రొంగలి రామకృష్ణ, మాజీ సర్పంచ్ గవిరెడ్డి కొండనాయుడు, మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీలు మత్స భవానీప్రసాద్, దంట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



జి.కోడూరులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్టు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ తెలిపారు. మండలంలోని జి.కోడూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు బొడ్డేటి వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు డప్పులు, కోలాటం, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని సంబంధిత శాఖల అధికారులతో నమోదు చేయించి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, ఎంపీడీవో అరుణశ్రీ, తహసీల్దార్ ప్రసాదరావు, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, నాయకులు భద్రాచలం, బొడ్డు గోవిదరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, స్థానిక నాయకులు తోట సత్తిబాబు, వెలగా రమణ, జగన్నాథం, బాబూరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర



స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మాడుగుల: జగన్నాథస్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక స్వామివారి ఆలయ ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర, బలభద్రుడు సమేతుడైన జగన్నాథస్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య పురవీధుల్లో ఈ యాత్ర శోభాయమానంగా సాగింది. ఆ సమయంలో రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. గ్రామంలో ఊరేగించి స్థానిక ఇంద్రద్యుమ్నం వద్ద కొలువు ఏర్పాటు చేశారు. స్వామివారు అక్కడే దశావతారాలలో దర్శనమిస్తారు. ఈ నెల 29వ తేదీన తిరిగి ఆలయానికి రథోత్సవం ద్వారా చేరడంతో యాత్ర పూర్తవుతుందని ప్రధాన అర్చకులు పండా నూకరాజు తెలిపారు.

దేవరాపల్లిలో ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం

దేవరాపల్లి: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక వ్యవసాయ కేంద్రం వద్ద రైతు భరోసా కేంద్రంలో జెడ్పీటీసీ కర్రి సత్యంతో కలిసి ఆమె రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో మాదిరిగా విత్తనాల కోసం రైతులు అవస్థలు పడకుండా గ్రామస్థాయిలోనే ఆర్బీకేల ద్వారా పొందుతున్నారన్నారు. జెడ్పీటీసీ సత్యం మాట్లాడుతూ రైతు పక్షపాతి సీఎం జగన్ అన్నారు. వారి చెంతనే విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు ఖరీఫ్ సాగు పెట్టుబడి నిమిత్తం రైతు భరోసా సాయం అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏవో వై.కాంతమ్మ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వార్డు మెంబర్లు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, సోమిరెడ్డి సత్యవతి, పరవాడ రవి, ఏఈవో ఎస్. కిరణ్‌కుమార్, ఆర్బీకే ఇన్‌చార్జులు కె. సత్యారావు, భాగ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు చర్యలు

రోలుగుంట ఎంఈవో-2 జగ్గారావు



ఎంఈవో-2 జగ్గారావుని కలసిన ఉపాధ్యాయులు

రోలుగుంట: పాఠశాలల్లో ఉత్తమ విద్యా బోధన, నాణ్యమైన ఆహారం అందించి ప్రవేశాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటానని నూతన ఎంఈవో-2 జగ్గారావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో మంగళవారం ఆయన్ను కేజీబీవీ ఎస్వో తులసి, రోలుగుంట, వెలంకాయలపాలెం, కె.నాయుడుపాలెం పాఠశాలల ఉపాధ్యాయులు రాంబాబు, చంద్రశేఖర్, చలం, ఎస్.కొత్తూరు హెచ్‌ఎం రమణ మర్యాద పూర్వకంగా కలిశారు. వారి పాఠశాలల్లో విద్యార్థులు, మౌలిక సదుపాయాల గురించి ఎంఈవో-2 అడిగి తెలుసుకున్నారు. మనం అందించే బోధనాధారంగానే పాఠశాలల్లో ప్రవేశాలుంటాయన్నారు. సమయపాలన పాటించాలన్నారు. మండలంలో అన్ని పాఠశాలలను సందర్శించి మెరుగైన విద్య అందేలా కృషి చేస్తానన్నారు.

సమర్థవంతంగా ‘జగనన్న సురక్ష’



మాట్లాడుతున్న తహసీల్దార్ వరహాలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్

దేవరాపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి వి. రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, వెల్ఫేర్ అసిసెంట్లతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని పాల్గొన్నారు.

రోలుగుంట: ‘జగనన్న సురక్ష’కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని తహసీల్దార్ వరహాలు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయిలో సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వెను వెంటనే పరిష్కరించాలన్నారు. ఒక వేళ సర్వే సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోయినా మరోసారి సందర్శించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి, ఇన్‌చార్జి ఈవోపీర్డీవో రవికిరణ్, వలంటీర్లు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంలో సాంకేతిక లోపాలు తలెత్తితే వెంటనే సరిచేయాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. జగనన్న సురక్షలో భాగంగా మంగళవారం తైపురం గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ఎంపీడీవో సువర్ణరాజు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



మేకలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశువైద్యాధికారి మంజూష

దేవరాపల్లి: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎం.అలమండ పశువైద్యాధికారి కె.మంజూష తెలిపారు. మంగళవారం ముషిడిపల్లిలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 700 మేకలకు, 300 గొర్రెలకు నట్టల నివారణ మందును తాపించారు. పెంపకదారులు తప్పనిసరిగా జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలని సూచించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణం పరిశీలన

కె.కోటపాడు: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణాన్ని టీటీడీ ఆర్కిటెక్చర్ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఆధ్యాత్మిక భావనను ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు ఆలయ నిర్మాణాలకు టీటీడీ నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచనల మేరకు ఇక్కడ కన్యకాపరమేశ్వరి ఆలయంతోపాటు కింతాడలో సీతారాముల ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధుల మంజూరుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, నాయకుడు శ్రీకాంత్ శ్రీను, పుట్టా శ్రీధర్ పాల్గొన్నారు.

పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా కొమళ్లపూడి

శివాలయం, పార్కు ప్రదేశాలను పరిశీలించిన విప్ ధర్మశ్రీ



కొమళ్లపూడిలో పార్కు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా కొమళ్లపూడి విరాజిల్లనుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఇక్కడ భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డును ఆనుకుని కొమళ్లపూడి, రావికమతం గ్రామాల మధ్యన పెద్ద చెరువు గర్భంలో శివాలయం నిర్మిస్తున్నారు. చెరువు చుట్టూ ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటు చేసి పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం కోటి రూపాయలు వెచ్చిస్తున్నారు. ఈ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణను అభినందించారు. బుచ్చెయ్యపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.10 లక్షలు, వినాయకుని గుడి నిర్మాణానికి రూ. 10 లక్షలు టీటీడీ నుంచి మంజూరు చేయించిన విప్ ధర్మశ్రీని నాయకులు సత్కరించారు.

300 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చోడవరం: సీడీపీఎం కమ్యూనిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంకుపాలెంలో ఉచిత కంటి వైద్యం, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సియోన్ కాన్సర్ ఆస్పత్రి, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి సహకారంతో వైద్యులు 300 మంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ నాగులాపల్లి రాంబాబు, ఎస్ఐ సూర్యనారాయణ, సీడీపీఎం కమ్యూనిటీ ఆర్గనైజర్ కొప్పాక రాజేష్, ముర్రోతు ముత్యాలనాయుడు, ఆయా ఆస్పత్రుల కో ఆర్డినేటర్లు స్వాములు, సుభాష్ పాల్గొన్నారు.

చదువుల్లో మరింత ప్రోత్సాహం

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ



చౌడువాడలో విద్యార్థులకు నగదు, మెడల్, సర్టిఫికెట్‌లను అందిస్తున్న జెడ్పీటీసీ అనురాధ



దిబ్బిడి విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లు అందిస్తున్న నాయకులు


కె.కోటపాడు: విద్యార్థులను చదువుల్లో మరింతగా ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలను సీఎం అమలు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. హెచ్‌ఎం ఈర్లి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం చౌడువాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఏ.కుసుమ, ఎస్.ఢిల్లీశ్వరరావు, జాన్సీ శరణ్యలకు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలను జెడ్పీటీసీ అందించారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయిప్రసాద్ పాల్గొన్నారు.

దేవరాపల్లి: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా హెచ్‌ఎం బి. చంద్రశేఖర్ అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కొటాన సందీప్(578), సుగ్గు శశాంక్(568), దారపురెడ్డి దివ్య(566)లకు ప్రోత్సాహకాలతోపాటు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వార్డు మెంబర్లు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, సోమిరెడ్డి సత్యవతి, సబ్బ వరపు మాలిబాబు, కొరుపోలు శ్రీను పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: విద్యార్థులకు ఉన్నత విద్యనందించి ప్రయోజకుల్ని చేయడమే సీఎం ధ్యేయమని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా బుచ్చెయ్యపేటలో దిబ్బిడి హైస్కూలు విద్యార్థులు గాడి భవాని, తాండ్రంగి అశ్విని, అయితరెడ్డి నాగలక్ష్మిలకు నగదు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాతాళ సత్తిబాబు, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, మాజీ ఎంపీటీసీ జెర్రిపోతుల అప్పలనాయుడు, నాయకులు రామారావు, భూషణం పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు, విద్యార్థుల ప్రవేశాల పెంపు తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పదిలో అధిక మార్కుల తెచ్చుకున్న మాకిరెడ్డి లక్ష్మణ, శెట్టి స్వాతి, బేతా సొమ్మలకు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు ఆర్.వి.ఎస్.ఆర్ శర్మ, శ్రీరామ్మూర్తి, రమాకుమారి, సతీష్ పాల్గొన్నారు.

కె.జె.పురం మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



సూర్యనారాయణ (ఫైల్)

మాడుగుల రూరల్: కె.జె.పురం మాజీ సర్పంచ్ కాళ్ల సూర్యనారాయణ (77) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన 1995 నుంచి 2001 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు గతంలో మృతి చెందాడు. రెండో కుమారుడు అమ్మతల్లినాయుడు ప్రస్తుతం స్థానిక సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సూర్యనారాయణ మృతదేహానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.జి.కుమార్, నాయకుడు పైలా ప్రసాదరావు, తదితరులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఫోన్లో పరామర్శించారు. సూర్యనారాయణ మృతి విచారకరమన్నారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు ఫోన్లో పరామర్శించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ వేమవరపు రామధర్మజ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. వీటిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిషత్ ద్వారా జరుగుతున్న పనులపై ఎంపీడీవో మీనాకుమారి సభలో నివేదిక చదివి వినిపించారు. సబ్సిడీపై 1,322 క్వింటాళ్ల విత్తనాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో వాసుదేవరావు తెలిపారు. తహసీల్దార్ పీవీరత్నం, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు

నర్సీపట్నం: సీపీఎం నేత కామ్రేడ్ సత్తిబాబు సంస్మరణార్థం మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ బి.స్వాతి పర్యవేక్షణలో పార్టీ నాయకులు, అభిమానులు రక్తదానం చేశారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న తమ పార్టీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఈరెల్లి చిరంజీవి, రామకృష్ణ, ప్రసన్న, డి.శివ, ఎస్. నాగరమణ, జి. రామకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ సిహెచ్.వెంకట్ పాల్గొన్నారు.